1.8 కేజీల గంజాయి పట్టివేత

అల్లాపూర్, 3 ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అల్లాపూర్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. బతుకుదెరువు కోసం బీహార్ రాష్ట్రం నుంచి హైదరాబాద్ వచ్చిన టిల్కా కేవట్(53) మేస్త్రీ పని చేసుకుంటూ యూసుఫ్‌నగర్‌లో స్థిరపడ్డాడు. మేస్త్రీ పని చేయగా వచ్చిన ఆదాయం అవసరాలకు చాలకపోవటంతో గంజాయి విక్రేతగా మారాడు. బీహార్ నుంచి గంజాయి తెచ్చుకుని బోరబండ ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్‌లో విక్రయించేవాడని, గంజాయి విక్రయిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడి నుంచి 1.8 కేజీల గంజాయి, ఓ సెల్ ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఏసీపీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు అల్లాపూర్ పీఎస్ బృందం నిందితుడిని యూసుఫ్‌నగర్ కాముని చెరువు వద్ద పట్టుకున్నారు.

పండుగలు సోదరభావంతో జరుపుకోవాలి

మియాపూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం హఫీజ్‌పేటలోని ఫ్రెండ్స్ ఫంక్షన్‌హాల్‌లో ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ శాఖల ప్రధాన సలహాదారులు జనాబ్ ముహమ్మద్ అలీ షబ్బీర్, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎంబీసీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జెరిపెటి జైపాల్ పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో ముహమ్మద్‌అలీ, రంజిత్‌రెడ్డి

రంజాన్ ఉపవాసాన్ని ఆచరించడం అభినందనీయం

అల్లాపూర్: రంజాన్‌మాసంలో ముస్లింలు ఉపవాస దీక్షను ఆచరించటం అభినందనీయమని కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ పేర్కొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వాజిద్ పాషా బుధవారం ఇచ్చిన ఇఫ్తార్ విందులో బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో వాజిద్‌పాషా, కూకట్‌పల్లి కాంగ్రెస్ బీ-బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, శేరి సతీష్ రెడ్డి, రేష్మ, పాల్గొన్నారు.

రంజాన్ మతసామరస్యానికి ప్రతీక

గచ్చిబౌలి: రంజాన్‌ను పురస్కరించుకుని శేరిలింగంపల్లి తారానగర్‌లో బుధవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అబీబ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ప్రజలకు అండగా ఉంటా: ఎమ్మెల్యే గాంధీ

వివేకానందనగర్‌కాలనీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్‌ను అభివృద్ధి చేయడంతో పాటు పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. సప్తగిరికాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో బుధవారం ఆయన ఆల్విన్‌కాలనీ డివిజన్‌కు చెందిన కార్యకర్తలతో సమావేశమయ్యారు. స్థానిక కార్పొరేటర్ పార్టీ మారినంత మాత్రాన బీఆర్ఎస్‌కు, ప్రజలకు ఒరిగేదేమీ లేదన్నారు. స్వార్థం, కుటుంబ స్వలాభం కోసం కార్పొరేటర్ పార్టీ మారారని, ప్రజలు పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రతిపక్షంలో ఉంటూ ప్రజాసమస్యలపై గళం విప్పుతుందన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ భూములు, చెరువులు కబ్జాకు గురికాకుండా చూస్తానని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, డివిజన్ ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రోడ్డుపై పారుతున్న మురుగునీరు

మ్యాన్‌హోల్ పొంగుతున్నా పట్టించుకోరా?

జీడిమెట్ల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ సర్కిల్ సుభాష్‌నగర్‌లో పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో నిత్యం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం ప్రజలు రాకపోకలు సాగించే ప్రధాన రహదారిపై మ్యాన్‌హోల్ పొంగిపొర్లి మురుగు నీరంతా నెలల తరబడి రోడ్డుపై పారుతున్నా వాటర్ వర్క్స్ సిబ్బంది గానీ, జీహెచ్ఎంసీ అధికారులుగానీ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. అంతేకాక నివాసప్రాంతాల్లో నిత్యం చెత్తకుప్పలు పేరుకుపోతున్నా ఎవరూ తొలగించడం లేదని పేర్కొంటున్నారు. తక్షణమే పొంగిపొర్లుతున్న మ్యాన్‌హోల్‌కి మరమ్మతులు చేసి ప్రజల సమస్యను పరిష్కరించాలని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

'చేవెళ్ల గడ్డపై కాషాయ జెండా ఎగరవేస్తాం'

హైదర్‌నగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో దేశమంతా నమో మోదీ అంటూ చేవెళ్ల ప్రజలు చైతన్యవంతులై భారతదేశ భవిష్యత్ కోసం మరోసారి మోదీని ప్రధానమంత్రిని చేయాలని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సీతారామరాజు అన్నారు. చేవెళ్ల పార్లమెంట్‌లో ఎన్నోఏళ్ల నుంచి ప్రజలకు సేవలందిస్తున్న విశ్వేశ్వరరెడ్డికి మంచిపేరు ఉందని చేవెళ్లగడ్డపై బీజేపీ జెండా ఎగురవేస్తామన్నారు. రాత్రికిరాత్రి పార్టీ మారి టికెట్ తెచ్చుకున్న రంజిత్‌రెడ్డికి డిపాజిట్ కూడా రాదని ఎద్దేవ చేశారు. శ్రీరామ మందిరం నిర్మాణం మోదీ తోనే సాధ్యమైందన్నారు.

కార్పొరేటర్ భూ కబ్జాలపై చర్యలు తీసుకోవాలి

నిజాంపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట కార్పొరేషన్ పరిధిలోని సర్వే నెంబర్ 191లో జీవో 59 ద్వారా 125 గజాలకు అనుమతి తీసుకొని పక్కనే ఉన్న మరో 65 గజాల ప్రభుత్వ భూమి ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నాడు కార్పొరేటర్ బాలాజీనాయక్. సదరు నిర్మాణాలను డిసెంబర్‌లో అధికారులు కూల్చివేసినా వాటిని పునర్నిమిస్తున్నారని బీజేపీ నాయకులు డిప్యూటీ ఎమ్మార్వో, మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. 400 గజాల ప్రభుత్వ స్థలం ఆక్రమించిన తక్షణమే చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమిని కాపాడాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.



కబ్జాలపై ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

జైపాల్‌కు శుభాకాంక్షలు తెలిపిన రంజిత్‌రెడ్డి

చందానగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఎంబీసీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జెరిపెటి జైపాల్, రామచందర్‌రాజును బుధవారం చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి జెరిపెటి నివాసంలో శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.



జెరిపెటి జైపాల్‌ను సన్మానిస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

జేఎన్‌టీయూ పరీక్షల విభాగంలో

గందరగోళం



జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీ పరీక్షల విభాగంలో మరోమారు గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. గతంలో మూడో ఏడాది బీటెక్ విద్యార్థుల ఫలితాల్లో గందరగోళ పరిస్థితులు ఏర్పడగా, ప్రస్తుతం మొదటి సంవత్సరం విద్యార్థులు అదే తరహా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మొదటి సెమిస్టర్ పరీక్షలు బాగా రాసినప్పటికీ కొందరు విద్యార్థులకు సంబంధించి.. రిజల్ట్ ప్రాసెసింగ్‌లో లోపాలు తలెత్తినట్లు తెలిసింది. ఈ కారణంగా ఎక్కువమంది విద్యార్థులకు సున్నా మార్కులు వచ్చినట్లు మెమోల్లో కనిపిస్తున్నట్లు సమాచారం. సెమిస్టర్ పరీక్షలు పూర్తయి రెండు నెలలవుతున్నా ఫలితాలు రాకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతుండగా, లోపాలను సరిదిద్దలేని పరిస్థితు ల్లో పరీక్షల విభాగం అధికారులకు ఏం చేయాలో దిక్కుతోచడం లేదు. గతానికి భిన్నంగా ఈ ఏడాది పరీక్షల మూల్యాంకనం విధానంలో తెచ్చిన మా ర్పులే ఈ పరిస్థితికి కారణంగా తెలుస్తోంది. గతంలో వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన ప్రొ.నర్సింహారెడ్డి ప్రస్తుతం కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఉన్నారు. ఈయన పరీక్షల విభాగానికి ఇన్‌చార్జ్‌గా ఉన్నప్పుడు.. ఆన్సర్ బుక్‌లెట్ వారీగా మూల్యాంకనం బదులు ప్రశ్నలవారీగా మూల్యాంకన విధానాన్ని ప్రవేశపెట్టారు.

ఆన్‌డ్యూటీలో ప్రిన్సిపాల్ బిజీబిజీ

మూల్యాంకన విధానంలో మార్పుల గురించి కొత్తగా వచ్చిన వైస్‌ప్రిన్సిపాల్‌కు గానీ, పరీక్షల విభాగం అధికారులకు గానీ అవగాహన లేకపోవడంతో సకాలంలో ఫలితాలు ఇవ్వలేక సతమవుతున్నారు. కొత్త విధానంపై అవగాహన ఉన్న ప్రిన్సిపాల్.. 2,500 మంది విద్యార్థుల సమస్యను గాలికి వదిలేసి, పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల నిర్వహణ పనుల్లో మునిగిపోయారని విద్యార్థి సంఘాల ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. కీలక బాధ్యతల్లో ఉన్న అధికారికి ఆన్‌డ్యూటీలో టీఎస్‌పీఎస్సీ బాధ్యతలు అప్పగించడం ఎంతవరకు సబబని ప్రశ్నిస్తున్నారు. ప్రిన్సిపాల్ అందుబాటులో ఉండకపోవడంతో అధికారులు, సుమారు 8,500 మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఫస్టియర్ ఫలితాలను సకాలంలో విడుదల చేయలేకపోవడంపై ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా, ప్రిన్సిపాల్ కాలేజీయేతర (ఆన్‌డ్యూటీ) పనుల్లో బిజీగా ఉన్నట్లు సిబ్బంది తెలిపారు.

నకిలీ కరెన్సీ చెలామణి చేస్తున్న నలుగురి అరెస్ట్

హైదరాబాద్ సిటీ/ పహాడిషరీఫ్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నకిలీ కరెన్సీని చలామణి చేస్తున్న అంతరాష్ట్ర ముఠా సభ్యులను మహేశ్వరం ఎస్ఓటీ, బాలాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. మహారాష్ట్ర జూనా జల్నా ప్రాంతానికి చెందిన షేక్ హరూన్ (40) గతంలో నకిలీ నోట్లు చెలామణి చేస్తుండగా ఔరంగాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. బయటకు వచ్చాక ఔరంగాబాద్‌కు చెందిన ఆటోడ్రైవర్లు సయ్యద్ సాగిర్ (30), జాకీర్ సయ్యద్ (35), అలీ అఫ్తాబ్ అక్తర్ (36)ను కలుపుకొని ముఠా ఏర్పాటుచేశాడు. వీరు కారులో తిరుగుతూ అసలుకు మూడు రెట్లు నోట్లు ఇస్తామంటూ ప్రచారం చేసుకుంటున్నారు. నమ్మి వచ్చిన వ్యక్తులకు నోట్ల కట్టల్లో ముందు, వెనుక అసలు నోట్లు ఉంచి, మధ్యలో చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నోట్లు ఉంచి మోసం చేస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్ఓటీ, బాలాపూర్ పోలీసులు హరూన్, సయ్యద్ సాగిర్, జాకీర్ సయ్యద్, అఫ్తాబ్‌ను అరెస్ట్ చేశారు. వారి వద్ద రూ. 25 లక్షల విలువైన చిల్డ్రన్ బ్యాంకు నోట్లు, నిసార్ కారు, 4 స్మార్ట్‌ఫోన్లు, 3 చిన్న ఫోన్లు, రూ. 8420 నగదు స్వాధీనం చేసుకున్నారు.

మరో వివాదంలో మాజీ మంత్రి మల్లారెడ్డి

- హరితహారం మొక్కలు నరికేసి కాలేజీ భవనాల నిర్మాణం
- మాజీ సర్పంచ్ భేరీ ఈశ్వర్



మాట్లాడుతున్న ఈశ్వర్

మేడ్చల్ ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి మరో వివాదంలో చిక్కుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన హరితహారాన్ని అపహాస్యం చేయడమే కాకుండా నాటిన వేల మొక్కలను తొలగించి కాలేజీ భవనాలు నిర్మించాడని స్థానికులు ఆరోపించారు. ఈ మేరకు మాజీ సర్పంచ్ ఈశ్వర్, గ్రామస్థులు గడిల కృష్ణారెడ్డి, ముద్రగణం సంపత్, గోపాల్, సాయికుమార్ తదితరులు బుధవారం కాలేజీ ఆవరణలో నాటిన మొక్కలను తొలగించి నిర్మించిన కాలేజీ భవనాలను మీడి యా ప్రతినిధులకు చూపించిన అనంతరం మాట్లాడారు. 2016-18లో మూడేళ్ల పాటు ఉమెన్స్ కాలేజీ ఆవరణలోని మైదానంలో అప్పటి మంత్రి కేటీఆర్, కలెక్టర్, సీఎంవో అధికారి ప్రియాంక వర్గీస్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, దాదాపు 10 వేల మంది విద్యార్థినులతో 32 వేల మొక్కలు నాటినట్లు తెలిపారు. అనంతరం నాటిన మొక్కలను తొలగించి అదే స్థలంలో పెద్దపెద్ద కాలేజీ భవనాలను నిర్మించారని వారు ఆరోపించారు. హరితహారం మొక్కలపై అప్పటి ప్రభు త్వం పటిష్టమైన చర్యలు చేపట్టిందని వేల మొక్కలను తొలగించిన మల్లారెడ్డిపై చర్యలు ఎందుకు తీసుకోలేదని వారు ప్రశ్నించారు. అంతేకాకుండా అనుమతులు లేకుండా పెద్ద ఎత్తున కాలేజీ భవనాలను నిర్మించారని వారు ఆరోపించారు. మల్లారెడ్డి సంస్థలపై, భూఅక్రమాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

రూ. 20 కోట్ల పరువునష్టం దావా..

తనపై తప్పుడు ప్రచారం చేస్తూ తన ప్రతిష్ఠకు భంగం కల్గించిన మాజీ మంత్రి మల్లారెడ్డిపై రూ.20 కోట్ల పరువు నష్టం దావా వేయనున్నట్లు మాజీ సర్పంచ్ భేరీ ఈశ్వర్ తెలిపారు. తనకు డబ్బు ఇచ్చినట్లు మల్లారెడ్డి చేస్తున్న దుష్ప్రచారంలో ఎలాంటి నిజమూ లేదన్నారు. మల్లారెడ్డి తనకు డబ్బు ఇచ్చినట్లు నిరూపించాలని ఆయన సవాల్ విసిరారు.

ప్రశ్నిస్తున్నందుకే నాపై సస్పెన్షన్ వేటు

కాంగ్రెస్ బహిష్కృత నేత బక్క జడ్సన్



సమావేశంలో మాట్లాడుతున్న బక్క జడ్సన్

పంజాగుట్ట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): 'తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత పది సంవత్సరాల పాటు జరిగిన దోపిడీపై నిరంతరం ఉద్యమించా. కాంగ్రెస్ ఐడియాలజీని పాటిస్తూ.. పూర్తిగా పార్టీ ఆర్గనైజేషన్‌కు అంకితమయ్యా. ప్రశ్నిస్తున్నందుకే నాపై సస్పెన్షన్ వేటు వేశారు' అని కాంగ్రెస్ పార్టీ బహిష్కృత నాయకుడు బక్క జడ్సన్ ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్‌లకు లాభం చేయడానికే రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని, బీజేపీ అత్యధిక సీట్లు గెలవాలని ఆయన కంకణం కట్టుకున్నారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కేసీఆర్ రైతులకు రైతుబంధు పథకం కింద ఇవ్వాలని పెట్టిన రూ.7వేల కోట్లను ప్రస్తుత సీఎం ఏమి చేశారన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తన సస్పెన్షన్, భవిష్యత్ కార్యక్రమాలపై ఆయన మాట్లాడారు. తనకు క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి వివరణ ఇవ్వాలని నోటీస్ ఇచ్చారని, ఫిర్యాదులు ఏమిటో చెప్పాలని అడిగినా.. అప్పటికే తీసుకున్న నిర్ణయం ప్రకారం తనను సస్పెండ్ చేశారన్నారు. వివిధ శాఖల్లో నిధుల దుర్వినియోగంపైన ఈడీకి, సీబీఐకి, కొందరి రాజకీయ నేతల అవినీతిపై తను చేసిన ఎన్నో ఫిర్యాదుల గురించి వివరించారు. ప్రాణభయం, రాజకీయ భవిష్యత్‌పై ఆశ వదిలేసి కల్వకుంట్ల కుటుంబంపై పోరాటం చేశానన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే ఓటు వేస్తా, వేయిస్తా అని అన్నారు. తాను ఎవరి చేతుల్లో ఆయుధం కాదన్నారు. అన్నింటిపైన ప్రశ్నిస్తున్న తనను సస్పెండ్ చేశారని, అయినా కూడా పార్టీమారేదే లేదన్నారు.


'ఎర్లీ'బర్డ్

- ఆస్తిపన్నులో 5 శాతం రాయితీ
- ఈనెల 30వ తేదీ వరకూ అందుబాటులో..

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంవత్సరం 2024-25 ఆస్తిపన్ను వసూళ్లలో భాగంగా ప్రతీ సంవత్సరం ఏప్రిల్ నెలలో 5 శాతం రాయితీతో జీహెచ్ఎంసీ ప్రవేశపెట్టే ఎర్లీ బర్డ్ పథకం ఈ యేడు త్వరగా అందుబాటులోకి వచ్చింది. ఈ పథకం ప్రతీ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి అందుబాటులోకి వచ్చినా గత ఆర్థిక సంవత్సర లెక్కలు, వాటి కంప్యూటరీకరణతో పాటు సిస్టంలు అప్‌డేట్ అయ్యేందుకు సుమారు 5 నుంచి 6 రోజుల సమయం పట్టేది. దీంతో ప్రతీసారి ఏప్రిల్ మొదటి వారంలో ఎర్లీబర్డ్ పథకం వినియోగదారులకు అందుబాటులోకి వచ్చేది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అధికారులు ఒక అడుగు ముందు కేసి కాదు.. కాదు.. నాలుగడుగులు ముందుకేసి ఏప్రిల్ 1వ తేదీ నుంచే ఎర్లీగా ఎర్లీబర్డ్ పథకాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. సర్కిళ్ల వారీగా ఎర్లీబర్డ్ లక్ష్యాలను ఉన్న తాధికారులు నిర్దేశించనప్పటికీ ఆస్తిపన్ను వసూళ్లను రెవెన్యూ అధికారులు, సిబ్బంది ముమ్మరం చేశారు. దీం తో అవగాహన కలిగిన వినియోగదారులు ఇప్పటికే ఆన్‌లైన్‌లో చెల్లింపులతో పాటు సీఎస్‌సీ (పౌర సేవా కేంద్రం)లో ఆస్తిపన్ను చెల్లిస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరం వరకు ఆస్తిపన్ను బకాయిలు పూర్తిగా చెల్లించిన వినియోగదారులకు మాత్రమే ప్రస్తుత సంవత్సరానికి చెల్లించాల్సిన ఆస్తిపన్నులో 5 శాతం రాయితీ వర్తిస్తుంది. ఈ పథకం ఏప్రిల్ 30 వరకు అందుబాటులో ఉంటుంది.



కుత్బుల్లాపూర్ సీఎస్‌సీలో ఆస్తిపన్ను చెల్లిస్తున్న వినియోగదారులు



5 శాతం రాయితీ చూపిస్తున్న ఆస్తిపన్ను రశీదు

పరిశోధనా ఫలాలు సగటు మనిషికి ఉపయోగపడాలి

చార్మినార్ ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వైజ్ఞానిక, శాస్త్ర పరిశోధన ఫలాలు సగటు మనిషికి ఉపయోగపడాలని ఉస్మానియా యూనివర్సిటీ(ఓయూ) వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ డి. రవీందర్ అన్నారు. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్, ప్రభుత్వ సిటీ కాలేజీ భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'అడ్వాన్స్‌డ్ ఇన్ ఎనర్జీ మెటీరియల్స్ అండ్ డివైజెస్' అంశంపై సిటీ కాలేజీలో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. మొదటి రోజు సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై వీసీ రవీందర్ మాట్లాడుతూ.. సామాజికతత్వానికి వైజ్ఞానిక శాస్త్రాల పరిశోధనలకు మధ్య అంతర్గత సంబంధం ఉండాలన్నారు. సరికొత్త ఆలోచనలు, నూతన పరిశోధనలతో ముందుకు వచ్చే విద్యార్థులకు వర్సిటీ తరఫున ప్రోత్సాహం అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. గౌరవ అతిథిగా పాల్గొన్న ఓయూ సైన్స్ విభాగం డీన్ ఆచార్య డి.కరుణాసాగర్ మాట్లాడుతూ.. పర్యావరణహితమైన వైజ్ఞానిక ఆవిష్కరణలను, శక్తి సంబంధమైన సాధనాలను నూతనంగా రూపొందించుకోవాల్సిన అవసరముందన్నారు. ఏఆర్‌సీఐ అసోసియేట్ డైరెక్టర్ డా.పి.కె. జైన్ మాట్లాడుతూ పాఠ్యాంశాల ద్వారా నేర్చుకున్న పరిజ్ఞానాన్ని సామాజిక వికాసానికి ఎలా వినియోగించుకోవాలో విద్యార్థులకు శిక్షణనివ్వాలని అధ్యాపకులకు సూచించారు. సభకు అధ్యక్షత వహించిన సిటీ కళాశాల ప్రిన్సిపాల్ బాలభాస్కర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం సమాజం ఎదుర్కొనే సవాళ్లను అధిగమించటానికి అవసరమైన పరిశోధనలపై శాస్త్రవేత్తలు, ఆచార్యులు దృష్టి పెట్టాలన్నారు. ఐఐసీటీ సంస్థ శాస్త్రవేత్త ఆచార్య ఎం. వసుంధర, ఉస్మానియా విశ్వవిద్యాలయం భౌతికశాస్త్ర విభాగం అధ్యక్షుడు ఆచార్య ఎం శ్రీనివాస్ విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. సదస్సు సమన్వయకర్త డాక్టర్ కె.పర్వతాలు సదస్సు లక్ష్యాలను వివరించారు. భౌతికశాస్త్ర విభాగం అధ్యక్షురాలు డా. నైనవినోదిని, సదస్సు సహాయ సమన్వయకర్త డా.వాసుదేవరెడ్డి, ప్రిన్సిపాల్ అతిథులను సన్మానించారు.



సదస్సులో మాట్లాడుతున్న ఓయూ వీసీ రవీందర్

తక్కువ కోతతో ఊపిరితిత్తుల కేన్సర్ కణితి తొలగింపు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తక్కువ కోతతో ఊపిరితిత్తుల కేన్సర్ కణితిని తొలగించి ఖమ్మం జిల్లాకు చెందిన రావు(65) ఏళ్ల వ్యక్తి ప్రాణాలు మెడికవర్ కేన్సర్ ఇన్స్టిట్యూట్ వైద్యులు కాపాడారు. దగ్గు, శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బంది పడుతూ కొన్నిరోజుల క్రితం రావు మెడికవర్ కేన్సర్ ఇన్స్టిట్యూట్ సర్జికల్ అంకాలజిస్ట్ డా.పవన్ కుమార్‌ను సంప్రదించారు. అతడిని పరీక్షించిన డాక్టర్ స్కానింగ్ చేయించి, ఊపిరితిత్తుల్లో కేన్సర్ కణితి ఉందని గుర్తించి తక్కువ కోతతో సర్జరీ పూర్తి చేశారు. ఆస్పత్రిలో బుధవారం సమావేశంలో డా.పవన్‌కుమార్ మాట్లాడుతూ.. ఊపిరితిత్తుల లోబ్ తీసేయడం, కేన్సర్ కణితిని తొలగించడం లాంటి సర్జరీలు ఇంతకుముందు పెద్ద కోతతో ఛాతి కుహరాన్ని తెరిచి చేసేవాళ్లని తెలిపారు. ఈ సర్జరీ వల్ల నొప్పి ఎక్కువగా ఉండటంతో పాటు రక్తస్రావం ఎక్కువని, సర్జరీ తర్వాత రోగి కోలుకునేందుకు ఎక్కువ సమయం పట్టేదని తెలిపారు. పూర్తిస్థాయి రికవరీకి 3 నెలల సమయం పట్టేదని తెలిపారు. ప్రస్తుతం తక్కువ కోత (మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీ)తో చిన్న కోతతో ఊపిరితిత్తుల లోబ్ కణితిని తొలగించి కేవలం రెండు కుట్లు వేసినట్లు తెలిపారు. ఒకట్రెండు వారాల్లో కోలుకుంటారని, ఖర్చు కూడా తక్కువ అవుతుందన్నారు. ఈ సర్జరీతో ఊపిరితిత్తులకు ఇన్ఫెక్షన్ సోకటం తగ్గుతుందని, ఎక్కువ రోజులు వెంటిలేషన్ అవసరముండదని తెలిపారు.



రావుతో డా.పవన్ కుమార్

5న 'భావి భారతానికి సాంకేతిక అవకాశాలు' అంశంపై సింపోజియం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్షిక్ మహాసంఘ్ (ఏబీఆర్ఎస్ఎం) ఆధ్వర్యంలో "భావి భారతానికి సాంకేతిక అవకాశాలు" అంశంపై సింపోజియం నిర్వహిస్తున్నట్లు సదస్సు కో కన్వీనర్ డాక్టర్ ఎస్.రాజిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం 10గంటలకు జేఎన్‌టీయూలోని యూజీసీ ఆడిటోరియంలో ఈ సింపోజియం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ) చైర్మన్ ప్రొఫెసర్ సీతారాం, గౌరవ అతిథులుగా జేఎన్‌టీయూ వీసీ నర్సింహారెడ్డి, జైపూర్ ఎన్ఐటీ ప్రొఫెసర్ శ్రీమలి, ఏబీఆర్ఎస్ఎం సంయుక్త కార్యదర్శి గుంతా లక్ష్మణ్ పాల్గొంటారని వివరించారు. ఇంజనీరింగ్ విద్యార్థులు, ఆచార్యులు ఈ సింపోజియంకు హాజరుకావచ్చని తెలిపారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

మియాపూర్, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో ఉంచుకుని శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మంచి నీటి ఎద్దడి లేకుండా చూడాలని, నీటి సరఫరాలో అంతరాయం లేకుండా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ధ్యేయంగా జలమండలి అధికారులు పనిచేయాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఎండాకాలం దృష్టిలో పెట్టుకుని మంచినీటి ఎద్దడి లేకుండా సురక్షితమైన మంచి నీళ్లు అందించడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. కొన్ని కాలనీల్లో ప్రజలకు సరిపడా తాగునీరు సరఫరా కావడం లేదన్నారు. దీంతో నీటికోసం కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రజల ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

లక్ష్మారెడ్డిని ఎంపీగా గెలిపించాలి: ఎమ్మెల్యే కేపీ

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేసి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధి చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో రంగారెడ్డినగర్ డివిజన్ నాయకులు, కార్యకర్తలతో ఎంపీ అభ్యర్థితో కలిసి ఎమ్మెల్యే సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. మల్కాజ్‌గిరిలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు తోడుగా ఎంపీగా గెలిపిస్తే రెట్టింపు వేగంతో అభివృద్ధి జరుగుతుందన్నారు. లక్ష్మారెడ్డి మట్లాడుతూ.. హుజూరాబాద్‌లో చెల్లని రూపాయి మల్కాజ్‌గిరిలో ఎలా చెల్లుతుందని, రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా పనిచేసిన సునీత మహేందర్‌రెడ్డికి అసలు మల్కాజ్‌గిరి సమస్యలపై అవగాహన ఏమి ఉందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బి.విజయ శేఖర్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్, అభివాదం చేస్తున్న లక్ష్మారెడ్డి

'షాడో మేయర్ కాంగ్రెస్‌లోకి వస్తే ఒరిగేదేమీ లేదు'

నిజాంపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట కార్పొరేషన్ ఏర్పడిన అనంతరం మేయర్ భర్త షాడో మేయర్‌గా వ్యవహరిస్తూ ప్రభుత్వ భూములు, పేదల ఆస్తులను ఆక్రమిస్తూ చలామని అవుతున్నాడని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రామచంద్రనాయక్ ఆరోపించారు. ఈ మేరకు నిజాంపేట పరిధి శ్రీనివాసనగర్‌కాలనీలోని వినాయక కల్యాణ మండపంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో విలేకరుల సమావేశం బుధవారం నిర్వహించారు. సుమారు రూ.2 వేల కోట్ల విలువైన కార్పొరేషన్ ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకున్నాడని ఆరోపించారు. జీవో 58, 59ల ఆధారంగా తప్పుడు పత్రాలు సృష్టించి, ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకొని డీల్ కుదుర్చుకుని రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నట్లు ఆరోపించారు. భార్య అధికారాన్ని అడ్డం పెట్టుకొని ప్రభుత్వ భూములను ఆక్రమించడం దారుణమన్నారు. షాడో మేయర్ తన ఆస్తులను కాపాడుకోవడానికి మాత్రమే రాజకీయాల్లోకి వచ్చాడన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్ రాజమౌళేశ్వర్, కృష్ణంరాజు, వర్మరాజు, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్యకర్తలు అధైర్య పడొద్దు: ఎమ్మెల్యే మాధవరం

బాలానగర్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో లేదని నాయకులు, కార్యకర్తలు అధైర్య పడొద్దని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బుధవారం బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వినాయకనగర్‌లో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని కార్యకర్తలకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థిగా రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపిస్తే అభివృద్ధికి కావలసిన నిధులను తీసుకొస్తాడని కార్యకర్తలకు వివరించారు. 10 యేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏనాడూ కరెంటు కోతలు, తాగునీటి సమస్యలు లేవని తెలిపారు. ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. కృష్ణారావును అసెంబ్లీకి పంపినట్లుగానే తనను కూడా ఆశీర్వదించి పార్లమెంటుకు పంపాలని కార్యకర్తలను కోరారు.



కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు, ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

చెరువును తోడేస్తున్న వారిపై చర్యలు తీసుకోండి

అల్లాపూర్: చెరువులోని నీటిని తోడేస్తున్నారన్న స్థానికుల ఫిర్యాదుల మేరకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అల్లాపూర్ డివిజన్ పరిధిలోని కాముని చెరువు, మైసమ్మ చెరువు పరిసర బస్తీలైన సఫ్దర్‌నగర్ రాజీవ్‌గాంధీనగర్ ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. భూగర్భ జలాలు ఇంకిపోవటంతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో చెరువు నీటిని అక్రమంగా బోర్లు వేసి తోడేయటాన్ని ఎమ్మెల్యే తీవ్రంగా ఆక్షేపించారు. అక్రమంగా వేసిన బోర్లను తొలగించాలని అధికారులను కోరారు. కాముని చెరువు కట్టను ఆనుకుని వెలసిన నిర్మాణాల్లో మూడు, నాలుగు బోర్లు వేసినట్టు ఎమ్మెల్యే దృష్టికి స్థానికులు తీసుకొచ్చారు. ఎమ్మెల్యే పర్యటనను గమనించిన అక్రమ బోర్ల యజమానులు ఇళ్లు, షటర్లకు తాళాలు వేసి ఉడాయించారు. జడ్‌సీ, ఎమ్మార్వో, ఇరిగేషన్, పోలీస్ అధికారులకు ఫోన్ ద్వారా సూచనలిచ్చిన కృష్ణారావు, సత్వరమే చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సబీహ బేగం, గౌసుద్దీన్, ఇస్మైల్, రఫీఖ్, అబ్దుల్ హమీద్ పాల్గొన్నారు.